క్లుప్తంగా

బీసీల సంక్షేమానికి చేసిన తీర్మానాలను అమలు చేయాలి

కాచిగూడ: బీసీల సంక్షేమానికి ప్రభుత్వం రూపొందించిన తీర్మానాలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 54 శాతం ఉన్న బీసీల సంక్షేమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. 2017 డిసెంబర్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేలతో బీసీల సమస్యలపై చర్చించి 210 తీర్మానాలతో బీసీ పాలసీని రూపొందించారని తెలిపారు. ఈ తీర్మానాల అమలుపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీల సమగ్రాభివృద్ధికి రూ.10వేల కోట్లతో ఉప ప్రణాళికను అమలు చేయాలని కోరారు. బీసీ మహాసభ నేతలు డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, ధరణీధర్‌యాదవ్, ప్రదీప్‌గౌడ్, నల్లెల కిషోర్, భూషణ్ భాస్కర్, మెట్టు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి: శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, ఆర్ఆర్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో వైకే, వెంకట్రావ్ స్ఫూర్తి సేవా పురస్కారాలు– 2023 ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు గాయని ఆమని ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో సాయంత్రం 5గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. విద్యావేత్త డాక్టర్ జగదీష్ యలమంచిలికి ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డును అందజేస్తామన్నారు.

ప్రజా సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావన



బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: ప్రజా సమస్యలపై బీజేపీ కౌన్సిల్ సమావేశంలో బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. బుధవారం జరిగిన సమావేశానికి ఆమె హాజరై డ్రైనేజీ మట్టిని తొలగించడంలో అధికార యంత్రాంగం ఎందుకు విఫలమవుతుందని ప్రశ్నించారు. వీధి దీపాల నిర్వహణ, అగ్ని ప్రమాదాలపై ఆమె కౌన్సిల్‌లో ప్రశ్నించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కాచిగూడ: జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ప్రజాజీవన రైతు పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మాదిరెడ్డి అనిల్ కుమార్ అన్నారు. నగరంలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రజలు నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బుధవారం జరిగిన జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై చర్చ జరగకుండా అధికారులు బైకాట్ చేసి వెళ్లడం బాధాకరమన్నారు. తొలిసారిగా జీహెచ్ఎంసీ చరిత్రలోనే అధికారులు సమావేశాన్ని బాయ్‌కాట్ చేయడం దురదృష్టకరమన్నారు.

హోంగార్డుపై దాడిచేసిన వ్యక్తి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు

కాచిగూడ: విధి నిర్వహణలో ఉన్న ఆర్‌పీఎఫ్ హోంగార్డుపై దాడిచేసి గాయపరిచిన వ్యక్తిని కాచిగూడ ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 30న రాత్రి జామై ఉస్మానియా రైల్వేస్టేషన్‌లో విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు వెంకటేశ్వర్లుపై రాళ్లతో దాడి చేయగా.. తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. నిందితుడు న్యూ బాలాజీనగర్‌కు చెందిన నవాజ్ (25)గా పోలీసులు గుర్తించారు. అతడిని కాచిగూడ ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం కాచిగూడ రైల్వే పోలీసులకు అప్పగించారు.

సింపోజియాలకు ఓయూ ముస్తాబు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో రేపటి నుంచి (5న) ప్రారంభం కానున్న జాతీయాలకు ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఆయా విభాగాలను ముస్తాబు చేశారు. నిధుల సమీకరణ మొదలు అన్ని కార్యక్రమాలు విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగే రెండు రోజుల సింపోజియాలలో ఆయా విభాగాలలో విద్యార్థులు కొత్తగా కనిపెట్టిన మోడల్స్ (అంశాలు) ప్రదర్శించనున్నారు. సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఇటీవల ప్రారంభమైన సచివాలయ భవనం నమూనాన్ని ప్రదర్శన కోసం తయారు చేశారు. సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, బయోమెడికల్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగాలలో విద్యార్థులు తయారు చేసిన మోడల్స్‌ను ప్రదర్శించనున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- రూ. 50 లక్షలతో అభివృద్ధి పనులు
- స్టీల్ బ్రిడ్జి పనుల జాప్యంపై కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ ఆగ్రహం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సునీతాగౌడ్

ముషీరాబాద్: నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రూ.50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. బుధవారం రాంనగర్ డివిజన్‌లో దాయర మార్కెట్ సమీపంలో రూ.30 లక్షలతో చేపట్టనున్న వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు, అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్ చౌరస్తా సమీపంలో రూ.3 లక్షలతో డ్రైనేజీ పైపులైన్ పనులు, ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో రూ.18 లక్షలతో ఫ్లోరింగ్, ప్రహరీ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బస్తీలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

- ఇటీవల కాలంలో ఏ బస్తీలో సమస్య తలెత్తినా.. యుద్ధప్రాతిపదికన నిధులను మంజూరు చేసి శాశ్వతంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు.
- గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో అస్తవ్యస్థ రోడ్ల గతిని మార్చిన ఘనత తమదేనని కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి ప్రతి బస్తీలో రోడ్లను నిర్మించామన్నారు.
- చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల నిర్మాణాల సమస్యలను పరిష్కరించామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల మధ్యే ఉంటూ.. వారి సమస్యలను తమ దృష్టికి తీసుకురావడంతో ప్రత్యేక నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నామన్నారు. అడిక్‌మెట్, రాంనగర్, ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్లు సునీతాగౌడ్, రవిచారి, ఎం.సుప్రియాగౌడ్, జీహెచ్ఎంసీ ఏఈ మురళీ, బీఆర్ఎస్ పార్టీ యూత్ విభాగం నేత ముఠా జైసింహ, రావులపాటి మోజెస్, నర్సింగ్‌ప్రసాద్, ఆకుల అరుణ్, శ్రీధర్‌రెడ్డి, అజయ్‌ముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, దామోదర్‌రెడ్డి, సురేందర్, రవియాదవ్, సయ్యద్ అస్లాం, ఎ.శ్రీనివాస్, ప్రేమలతారెడ్డి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాలు వాయిదా వేయడం సిగ్గుచేటు..



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: అశోక్‌నగర్ నుంచి ఆర్టీసీక్రాస్‌రోడ్స్ వరకు నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జి నిర్మాణంపై స్థానిక గాంధీనగర్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించారు. రెండేళ్లుగా కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణంతో చిరువ్యాపారుల వ్యాపారాలు ఉపాధి లేక దెబ్బతింటున్నాయన్నారు. నత్తనడకన పనులు సాగుతున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.426 కోట్లు వ్యయం చేసి నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం జాప్యంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అశోక్‌నగర్ చౌరస్తా నుంచి ఆర్టీసీక్రాస్‌రోడ్స్ వరకు రోడ్డును మూసివేసి రెండు నెలలు అవుతోందని ఈ రహదారిలో ఉన్న వ్యాపారులు ఉపాధిని కోల్పోతున్నారన్నారు. అనంతరం కార్పొరేటర్ ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాలను వాయిదా వేయడం సిగ్గుచేటన్నారు.

అధికారులు సమాధానం చెప్పలేకే..

- 'స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం విషయంలో జాప్యంపై తాను అడిగిన ప్రశ్నకు సమాచారం చెప్పలేక మేయర్, అధికారులు తోకముడిచారని' ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని ఆశించామన్నారు.
- కౌన్సిల్ సమావేశాలను అర్ధాంతరంగా వాయిదా వేస్తున్నారన్నారు. స్టీల్‌బ్రిడ్జి విషయంలో తనతో పాటు తన తోటి కార్పొరేటర్లు ప్రశ్నలు వేస్తారనే భయంతోనే అర్ధాంతరంగా కౌన్సిల్ సమావేశాలను వాయిదా వేశారన్నారు.
- హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ వాల్ విషయంలో జరుగుతున్న అవకతవకలపై తాను ప్రశ్నించానని సమాధానం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్‌బోర్డు ఉన్నతాధికారులు కౌన్సిల్ సమావేశాలకు హాజరైతే కిందిస్థాయి అధికారులు మాత్రం బాయ్‌కాట్ చేసి వెళ్లడం సరికాదన్నారు. కౌన్సిల్ సమావేశాలను ఓ ప్రణాళిక ప్రకారం వాయిదా వేసుకుంటూ.. వెళ్తే సహించబోమని ప్రజా క్షేత్రంలోనే సమాధానం చెప్పాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఐ నేతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం తన విధానాలతో సంక్షేమ రాజ్యాన్ని నిర్వీర్యం చేస్తుందని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి ఆరోపించారు. 'ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ.. అంతర్గత ఘర్షణలను' ప్రోత్సహిస్తుందన్నారు. బుధవారం చిక్కడపల్లిలో కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలని కోరుతూ.. 'బీజేపీ హటావ్ దేశ్ బచావ్' నినాదంతో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ ముషీరాబాద్ కార్యదర్శి వెంకటస్వామిగౌడ్, సహాయ కార్యదర్శి జె.సురేందర్, జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, జె.కుమార్, శ్రీనివాస్, కల్యాణ్, ఒమర్‌ఖాన్, లతీఫ్, ఆనంద్‌గౌడ్, ఉపేందర్, విశాల్ తదితరులున్నారు.

రామానుజుల శోభాయాత్రను అడ్డుకోవడం అవమానకరం



మాట్లాడుతున్న తెలంగాణ చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవ్

నల్లకుంట: భగవద్రామానుజుల ఉత్సవాల సందర్భంగా తిరుచానూర్‌లోని మాడవీధుల్లో నిర్వహించిన భగవద్రామానుజల శోభాయాత్రను టీటీడీ విజిలెన్స్ అధికారులు అడ్డుకోవడాన్ని తెలంగాణ చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన చాత్తాద శ్రీ వైష్ణవులను అవమానించడమేనని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనకు నిరసనగా బుధవారం నల్లకుంటలోని నర్మదా భవన్‌లోని చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవ్, ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటరమణల ఆధ్వర్యంలో రామానుజ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీటీడీ విజిలెన్స్ తీరుపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ ఘటనపై ఏపీ ప్రభుత్వం స్పందించి రామానుజుల శోభాయాత్రను అడ్డుకున్న టీటీడీ విజిలెన్స్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తులసి సత్యనారాయణ, బిక్కుమళ్ల నిర్మల, ఆర్థిక కార్యదర్శి కృష్ణస్వామి, సాంప్రదాయ కార్యదర్శి రాంగోపాల్, సంయుక్త కార్యదర్శి వెంకటయోగి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గౌడ ఐక్య సాధన సమితి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, వి.శ్రీనివాస్‌గౌడ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గౌడల సంక్షేమానికి చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. నీరా ప్రాజెక్టులతో పాటు గౌడ్‌ల అభివృద్ధికి అనేక పథకాలు తీసుకువచ్చారన్నారు. గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణ్‌గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షులు భిక్షపతిగౌడ్, అఖిల భారత గౌడ సంఘం అధ్యక్షులు వేములయ్య, మహిళా అధ్యక్షురాలు విజయరాణి, రాష్ట్ర నాయకులు పులి శివకుమార్, నర్సింహ్మ, మానసగౌడ్, కొప్పుల రవీందర్, బాలకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తాం



ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

చిక్కడపల్లి: దేవాలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. నగరంలో ప్రసిద్ధి గాంచిన ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో బుధవారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ముఠాగోపాల్, పార్టీ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజవర్గ పరిధిలో పలు దేవాలయాల అభివృద్ధికి ఇప్పటికే సహకారం అందించామన్నారు. భక్తులకు అనుగుణంగా దేవాలయ అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. దేవాలయ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈఓ లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ.. దాదాపు రూ.10 లక్షల వ్యయంతో దేవాలయంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, సభ్యులు వెంకట గోవిందరావు, రమణమూర్తి, డాక్టర్ వెంకటరమణ, రాజు, శ్రీనివాస్, హనుమంతరావు, దశరథ్, హరిత, స్వరూప, బీఆర్ఎస్ నాయకులు శంకర్ ముదిరాజ్, శ్రీధర్‌చారి, కిరణ్, లక్ష్మి, రాజేందర్, ఆలయ సిబ్బంది, రాజన్, రాజు, ఆలయ అర్చకులు జగన్‌మోహనాచార్యులు, బుచ్చమాచార్యులు, భవనందశర్మ, గోపాలాచార్యులు పాల్గొన్నారు.

'పెట్టి రోజ్' పురస్కారం.. బహుమతి ప్రదానం



నల్లకుంట: ఇజ్రాయిల్ 75వ స్వాతంత్ర వేడుకల సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న పలువురికి అక్కడి ప్రభుత్వం పురస్కారాలను ప్రకటించింది. దీనిలో భాగంగా నల్లకుంటకు చెందిన ఇండో ఇజ్రాయిల్ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆడంరాజు డెక్కపాటి, బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్ రాజు 'పెట్టి రోజ్' పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం దేశ రాజధాని న్యూఢిల్లీలో ఇజ్రాయిల్ తరఫున కేంద్ర మైనార్టీ సహాయ మంత్రి జాన్ బర్ల వారికి ఈ పురస్కారంతో పాటు బహుమతిని అందజేశారు.

వంశీ రామరాజుకు సత్కారం



సన్మానిస్తున్న ఏంవీరావు, సుజాత, రమణమూర్తిలు

చిక్కడపల్లి: దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, దర్శకుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల వంశీ రామరాజుకు 'దాసరి కళా సామ్రాట్' బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుజారమణ కల్చరల్ అకాడమీ త్యాగరాయగానసభలో ఆయనకు అభినందన సత్కారం జరిగింది. జంటనగరాల గాయనీ గాయకులు రామరాజు వంశీ సంస్థను 50 ఏళ్ల క్రితం స్థాపించి ఎందరో కళాకారులకు వేదిక కల్పించటంతో పాటు దివ్యాంగుల ఆశ్రమం ద్వారా సేవా కార్యక్రమంతో సమాజంలో గుర్తింపు పొందారన్నారు. మెడిద సుబ్బయ్య ట్రస్ట్ ఏంవీరావు, నిర్వాహకులు సుజాత, రమణమూర్తి అభినందనలు తెలిపారు.

క్రైస్తవుల సమస్యలను పరిష్కరించాలి



బోయినపల్లి వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ (టీయూసీపీఏ) కమిటీ సభ్యులు క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా బుధవారం టీయూసీపీఏ ప్రధాన కార్యదర్శి గోనె సోలమాన్‌రాజు మాట్లాడుతూ.. నూతన చర్చిల నిర్మాణం కోసం అనుమతి ఇవ్వాలని పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరినట్లు ఆయన తెలిపారు. దీనికి వినోద్‌కుమార్ సానుకూలంగా స్పందించారని సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వివరించారు. టీయూసీపీఏ ఉపాధ్యక్షుడు మెన్నో జోయెల్, జయకుమార్, బెనోని రిచర్డ్, జయప్రకాశ్, ప్రబోద్ విల్సన్, హేమలత, షాలిని, ఆనంద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

కాచిగూడ: ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని 'ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్' (ఏఐసీఎఫ్) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందని ఫెడరేషన్ రాష్ట్ర కో- ఆర్డినేటర్ ఏకే గిడియోను బాబు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన బుధవారం ఓ ప్రకటనలో వివరించారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా సాధనకై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో సమావేశాలు ఏర్పాటు చేసి దళిత క్రైస్తవుల్లో చైతన్యం తీసుకురానున్నట్లు తెలిపారు. త్వరలోనే హైదరాబాద్‌లో లక్ష మంది దళిత క్రైస్తవులతో భారీ బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఏఐసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్ నారబోయిన అధ్యక్షత వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు విజయరాజు, డేవిడ్ కదారి, డాక్టర్ యస్. అబ్రహం, బిషప్ శామ్యూల్ జాన్, మేడ అహరోను, జయశ్రీ, వనితా అలెగ్జాండర్, మంగేశ్వరి, కల్యాణి, గ్రేస్ నిర్మల, నిత్య సుజాత, అమర్‌నాథ్, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలను పట్టించుకోవాలి

ముషీరాబాద్: ప్రజల కష్టాలను పట్టించుకోవాల్సిన ప్రజాప్రతినిధులే కంచె చేను మేసిందన్నట్లుగా పరిపాలన కొనసాగిస్తున్నారని బీజేపీ సీనియర్ నేత సూర్యనారాయణశర్మ విమర్శించారు. మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను ఎరగా చూపుతున్నారని ఆరోపించారు. బుధవారం ఆయన కార్యాలయం నుంచి పత్రిక ప్రకటన విడుదల చేశారు. సంక్షేమ పథకాల పేరిట పేద ప్రజలకు ఒరిగింది ఏమి లేదని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఏరగా చూపి అధికారం చేజిక్కించుకోవాలని బీఆర్ఎస్ చూస్తుందన్నారు. 9 ఏళ్ల పాలనలో ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారన్నారు. ఎలక్షన్లు సమీపిస్తున్న సమయంలో మరోసారి రాష్ట్ర ప్రజలను డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని మభ్యపెట్టి గద్దెనెక్కాలని చూస్తున్నారని పేర్కొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు అభినందన



వీఎస్‌టీ వర్కర్స్‌ను అభినందిస్తున్న యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ కార్మికులు మేడే సందర్భంగా ప్రభుత్వం నుంచి శ్రమ శక్తి అవార్డు అందుకున్నందుకు వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం శ్రమశక్తి అవార్డు గ్రహీతలు నరేందర్‌గౌడ్, రవియాదవ్, ఐలి శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించి అభినందించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఐ.ప్రభాకర్, బాబి తదితరులున్నారు.

రూ.30 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు



డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్

అంబర్‌పేట: ప్రజా అవసరాలకు అనుగుణంగా పైప్‌లైన్ వ్యవస్థను ఆధునీకరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ నరేంద్రనగర్‌లో రూ.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల కాలం నాటి పైప్‌లైన్ వ్యవస్థను దశలవారీగా తొలగించి కొత్త పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యలను పర్యటన ద్వారా అడిగి తెలుసుకుంటున్నామన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: నమిత గ్రాండ్ అపార్ట్‌మెంట్ వీధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులతో కలిసి పరిశీలించారు. బుధవారం అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్‌లోని నమిత గ్రాండ్ అపార్ట్‌మెంట్ వీధిలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం నూతన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తామని స్థానిక ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. బుధవారం నమిత గ్రాండ్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యనారాయణ, సభ్యులు చంద్రశేఖర్‌రావు, కుమార్, బీఆర్ఎస్ నాయకులు సురేందర్, అనురాధా తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి



ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న

కవాడిగూడ: అకాల వర్షం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో పండించిన పంట పూర్తిగా దెబ్బతిందని రైతుల చేతికి రావాల్సిన పంట పూర్తిగా నష్టపోయారని రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల పంట నష్టపరిహారం ఇవ్వాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న డిమాండ్ చేశారు. అకాల వర్షం వల్ల పత్తి, మిర్చి, మొక్కజొన్నతో పాటు పంట తోటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంటకు 2020 నుంచి నేటి వరకు ప్రకటించిన బీమా పథకం అమలు కాలేదని విమర్శించారు. బుధవారం ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తు నష్టానికి రైతులకు నష్టపరిహారం నేటికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

- గత మార్చి 23న సీఎం కేసీఆర్ నష్టపోయిన రైతులకు వారం రోజుల్లో ఎకరానికి రూ.10 వేలు అందిస్తామని ఇచ్చిన హామీ నెల రోజులు కావస్తున్నా అమలు కాకపోవడం దురదృష్టకరమన్నారు.
- నష్టపోయిన రైతులకు తక్షణమే తమ ఖాతాల్లో నష్టపరిహారం డబ్బులను జమ చేయాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు.
- అనేక రోజులుగా కేంద్రాల్లో పంటను అమ్ముకునేందుకు వచ్చిన రైతులను అకాల వర్షం కారణంగా మార్కెట్‌లోనే వరిపంట మొక్కలుగా మొలిచాయని ఇంత దుర్భర పరిస్థితుల్లో రైతులు ఉన్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు.
- తక్షణమే మార్కెట్‌లో నిల్వ ఉండి తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు బ్యాంక్ రుణాలు రద్దు చేయాలన్నారు. కౌలు, పోడు రైతులకు పంట నష్ట పరిహారంతో పాటు ప్రభుత్వం అందించే పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే వరకు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.